మినీకథ

# కంప్యూటరూ–కందసామీ!

'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా?' అన్నట్టు సొంత కొంపైనా లేని మా సర్కారీ కచ్చేరీకి ఓ నాలుగు కంప్యూటర్లొచ్చాయి. అవి రావడానికో నెల్లాళ్ళ ముందు ఓ నలుగురు సీనియర్లకి 'కంప్యూటర్ అవగాహన' మీద క్లాసులు కూడా జరిగాయి. సదరు సీనియర్లలో నేనూ ఒకణ్ణి. వారం రోజులపాటు క్లాసుల వంకతో ఆఫీసు పనికి నాగాపెట్టి కంప్యూటర్ సెంటర్ వాడిచ్చే కాఫీ ఫలహారాదులు (సర్కారీ పద్దులోనే!) ఆరగిస్తూ, ఏదో హాయిగా గడిపేసిన మాకు ముందున్న మొసళ్ళ పండగని గురించిన అవగాహన మాత్రం లేకపోయింది.

—ఛాయామల్లిక్




'కంప్యూటర్లొచ్చేసాయ్!... ఇక సీనియర్లకి చేతి నిండా పని!' అంటూ మా ఆఫీసర్ మాకొక బృహత్కార్యాన్ని అప్పగించాడు. మా నలుగురి గుండెలూ కోరస్‌లో గుభేలుమన్న తత్కార్యం ఏమిటంటే, 'ఏళ్ళ తరబడి దస్త్రాల్లోనూ, బీరువాల్లోనూ పడి మూలుగుతున్న అతుకుల బొంత రికార్డులన్నీ కంప్యూటర్లకి వివరంగా తినిపించడం! (చదువరి అన్యథా భావించకుండు గాక!... ఫీడ్ చెయ్యడం అన్న మాటని తెనిగించానంతే!)

ముంచుకొస్తున్న ఉపద్రవాన్ని గమనించిన మాలోని 'సీనియర్ ఆఫ్ ది సీనియర్స్' భీమారావు అకస్మాత్తుగా రక్తపోటు పెరిగిందని నెల్లాళ్ళు సిక్‌లీవ్ పెట్టేసాడు. తత్కారణం చేత 'సీనియర్ ఆఫ్ ది జూనియర్స్' కందస్వామి–ది గ్రేట్ మా డేటా ఎంట్రీ ఆపరేటర్ల టీములోకి వచ్చిపడ్డాడు. లక్కు తంతే బూరెగల గంపలోకి వచ్చి పడ్డట్టుగా! కందస్వామిని 'ది గ్రేట్' అని ఎందుకన్నానంటే మా ఆఫీస్ స్టాఫ్‌లో అతనొక్కడే ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాడు... తన పూర్వాశ్రమంలో ఎప్పుడో! ఆ సంగతి తెలీగాక మా ఆఫీసర్ ఎంతో ఆనందించి 'కందసామీ! నువ్వు మాత్రం డేటా ఎంట్రీకి బదులు మన ఆఫీసు ప్రొసీజర్‌కి సంబంధించి ఏదైనా మంచి ప్రోగ్రాం తయారుచెయ్యవోయ్!' అని ఆర్డరేసాడు. సరిగ్గా అప్పట్నించే మొదలయ్యింది అసలు కథ!

బూజుపట్టిన రికార్డుల్లో మునిగి తేలుతూ, ఊపిరందక ఉక్కిరిబిక్కిరౌతున్న మా ముగ్గురికీ వాలుగ్గా డిదల బరువు మూడే మొయ్యడం అన్నది అనుభవంలోకి వస్తుంటే, మాకన్నా ఎంతో జూనియరైన కందసామి మాత్రం తీరిగ్గా కిటికీ దగ్గర సీటేయించుకుని కంప్యూటర్ ప్రోగ్రామింగ్ పేరిట ఏవేవో ప్రయోగాలు చేస్తుండేవాడు. మాకెవరికీ సరైన పరిజ్ఞానం లేకపోవడంవల్ల అతను నిజంగా పనిచేస్తున్నాడో లేక ఆడుకుంటున్నాడో కూడా తెలుసుకోలేక పోయేవాళ్ళం... ఏవేవో గణితానికి సంబంధించిన సమీకరణలూ, టెలిగ్రాం మెసేజిల్లాటి లైన్లూ కంప్యూటర్‌కి ఫీడ్ చేసేవాడు. ఏవేవో రిపోర్టులూ – స్టేటుమెంట్లూ ప్రింటు తీసుకుని చూసి, పెదవి విరుస్తూ అవన్నీ చింపేసేవాడు... ఇలా దాదాపు పదిహేను రోజులు గడిచాయి. మా ఆఫీసరు అడిగినప్పుడల్లా 'ఇదిగో అయిపోవచ్చింది సార్!... ఇక్కడో లాజిక్ దెబ్బతిని రిపోర్టు సరిగ్గా రావట్లేదు' అనేవాడు.

'నేనూ కందసామిలా సుఖపడొచ్చన్న' పేరాశతో రోజుకో గంటసేపు సొంత ఖర్చుతో ప్రోగ్రామింగు నేర్చుకోవడం మొదలు పెట్టాను నేను. కొన్నాళ్ళ తర్వాత నాకు వచ్చిన స్వల్ప పరిజ్ఞానంతోనే కందసామి లేనప్పుడు అతను చేస్తున్న ప్రోగ్రాముని చదివేను. అప్పుడు నాకేదో అనుమానం కలిగింది. వెంటనే ఆ ప్రోగ్రాముని రన్‌చేసి 'అవగా ఉపయోగించి' చూసాను. ఆ ప్రోగ్రాముని దశలవారీగా ఉపయోగిస్తూ వచ్చేసరికి నా అనుమానం కాస్తా నిజమై కూచుంది. 'ఔరా... కందసామీ!' అనుకున్నాను.

ఇంతకీ ఆ ప్రోగ్రామ్ పేరు 'కే యొక్క ఖాతా'... అందులో 'కే' అనబడే వ్యక్తి యొక్క ఆదాయ వ్యయాలూ, ఆస్తులూ – అప్పులూ మొదలైన వివరాలే కాక... రోజువారీ జమాఖర్చులే కాక... చివరికి వాళ్ళింటి చాకలి పద్దుకి కూడా స్థానం కల్పించడం జరిగింది. నెరసి తేలిందేమంటే, సదరు 'కే' అనబడే కందసామిగారి సొంత లావాదేవీల ప్రోగ్రాము సర్కారు వారి సహాయ సహకారాలతో (ఆఫీసరు గారి ప్రోత్సాహ ప్రోద్బలాలతో... పరోక్షంగా!) దాదాపుగా పూర్తయి, త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధం కామంది' ఆఫీసరు అడిగిన ప్రోగ్రాం మాత్రం పత్తాలేదు.